తేలికగా, సుళువుగా బ్రతకడానికి

# మాయరోగాలు

అవసరాల రామకృష్ణారావు

అత్తగారా పసుపు పూసుకుంటారా? అని ఓ విధవ అత్తగార్ని పడుచుకోడలు అడిగిందిట. "నాకెందుకు నాయినా యివన్నీ?" అంది మా మేనత్త నేను మద్రాసునుంచి తెచ్చిన స్వీట్సు చూస్తూ.

"ఓ పడిసా ఏడుపా? ఒకరోజు విందు, పది రోజులు మందేకదా రామక్రిష్ణా! అభిమానంతో తెచ్చేవుగాని తినేయోగ్యత ఉండొద్దూ? కోతి ముండకేనా గీత బాగుండాలికదరా, నాయనా?"

సుబ్బమ్మత్త దుప్పటీమీదకు లాక్కుని 'పైకి' వణుకుతూ పడుకుంది.

"జబ్బేమిటి మావా?" అన్నాను నేను. ఆయన జవాబు చెప్పకుండానే అత్త అందుకుంది.

"అదేదో తెలుస్తే యిలా ఎందుకుందును నా తండ్రీ? డాక్టర్లచేతికి చిక్కే జబ్బాయిది? ఏదో అంటారు చూశావా, 'చాకలి ఉతకని మడత, సూర్యుడు చూడని గంగ' అని, అలాంటిది యిది!"

నేను మరింత ఆశ్చర్యపోయాను.

"ఎన్నాళ్ళనుంచీ?"

"పడిశం పదిరోజులుంటుంది. సన్నిపాతం మూడువారాలు కాస్తుంది. మలేరియా నెల లోగానే తెలుస్తుంది. అలాంటి సాధారణమైన 'అందర్లాంటి' రోగంలా దీనికి లెక్ఖాజమా ఉందా రామకృష్ణా? ఏన్నాళ్లు ఉంటుందో ఎంతబాధ పెడుతుందో!- అబ్బా, రాధాస్వామీ!" అంది సుబ్బమ్మత్త.

"ఏమిటీబాధ?" అని నేనుమళ్ళీ అడగలేదు. ఆ పేకెట్స్ తీసుకున్నాను.

"ఊరికే ఉంచేస్తే చెడిపోతాయి స్వీట్సు- మరోళ్ళకిస్తాను!" అన్నాను.

"ఎందుకునాయనా? అలా ఉండనీ అమ్మా! మీ మావయ్యకి యీ మిఠాయిలంటే పైకి చెప్పరుగాని వల్లమాలిన ప్రీతి. నీదగ్గిర అబద్ధమెందుకూ? విషపాతకాలైన మందులు మింగలేక-నోరు పాడైపోయి, అప్పుడప్పుడు బిళ్ళలు కొరకడం కద్దు. అదీగాక- 'కొడుకునుకనే కోడలుంటే, వద్దనే అత్తగారుంటుందా?' అన్నట్టు నువ్వంతదూరంనుంచి తెస్తే పుచ్చుకోకపోవడమేమిటీ? తప్పు తప్పు. చూస్తారేం? అందుకోండీ ప్యాకెట్లు!" అంది అత్తయ్య.

* * *

తెలివిగా, సుళువుగా బ్రతకడానికి-అన్నమాట చెల్లించుకోడానికీ అనేక నాటకాలాడ్డం మానవ జాతికి కొత్తేంకాదు. కోరినవస్తువు యియ్యకపోతే చిన్నపిల్లలు కళ్ళమ్మట నీళ్ళుచుక్క– అన్నది లేకపోయినా, యథాశక్తి ఏడుస్తారు. ముందే "వార్నింగు" యిచ్చినట్టు- ముందరికాళ్ళకు బందం వేసినట్టు—అన్నమాట జరిగించడం, మన పురాతన స్త్రీలు చీకటి కొట్లలో చేరడం మన సారస్వత వారసత్వమే. అనుకున్నప్రకారం మా తమ్ముడు సినిమాకి తీసికెళ్ళకపోతే మా మరదలికి వరసగా మూడురోజులు సరిగ్గా వంటవేళకి తలనొప్పి రావడం అందరూ ఎరిగిందే. మరి మూడు రోజులు సెలవు "ఎక్స్టెండ్" చెయ్యడానికి మా బావకు లీలగా జ్వరం తగలడం రివాజే. ఇంతెందుకు, గుమ్మంలో బంధువుని చూడగానే మా పిన్నిగారి కాంతం అమాంతంగా వేరే కూర్చోడం ఎవరెరగనిదీ?

* * *

ఎప్పుడేనా ఎవరేనా గడుసువాళ్లు అవసరం కొద్దీ జ్వరం నటిస్తారు. జీవితంలో అలాంటి సరదా "నటన"ల్ని నేను తిట్టను, ప్రోత్సహిస్తాను! కాని ఇదేమిటిది? మా మేనత్తకున్న జబ్బేమిటి? నాకు బోధపడలేదు!

* * *

"ఏమీలేదూ, 'జరుగుబడి సంకటం'!" అంది

మా శారద యింటికి వస్తూనే. నాకేమీ అర్థమవలేదు.

"ఏమిటే, ఎవరికి?" అన్నాను.

"ఏమనుకుంటే అనుకోండి- మరెవరికీ కాదు, మా అక్కయ్యకే!" అంది. మా పెదనాన్నగారి కూతురు కామాక్షీ- మా బావగారూ అవతల వీధిని కాపరమున్నారు. మా శారద వాళ్ళింటికి వెళ్ళింది. మా కామాక్షికి కూడా ఏం జబ్బో ఎవరూ చెప్పలేకపోతున్నారు. మా బావగారు దాన్ని విశాఖపట్నం తీసికెళ్ళేరు. అక్కడ 'ఎక్సురే' సహా తీయించారు. ఏ జబ్బూ లేదు పొమ్మన్నారు. ఏ రోగికైనా డాక్టర్లమీద నమ్మక ముంటుంది. డాక్టర్లమీద, వైద్యంమీద నమ్మకం సడలిన మా అక్కయ్యలాంటివారికి ఏంచేస్తే రోగం తగ్గుతుందో ఎవరికీ అర్థం అవలేదు. "దిక్కెవ్వరు, కామాక్షికి?" అనిపించింది.

"ఎక్సరే శరీరంలో ఏముందో చెబుతుంది, బుర్రలో ఏం బాధలున్నాయో అవతలవాళ్ళకేం తెలుస్తుందీ?" అంది మా కామాక్షి.

"ప్రక్కనే పిచ్చాసుపత్రి ఉంది, వాకబు చెయ్యలేకపోయారా?" అనేసిందిట పక్కనున్న ఓ పెంకి యిల్లాలు. మా అక్కయ్య తిట్టినతిట్లు యిన్నీ అన్నీ కావు. "ఎవరిబాధ ఎవరికి తెలుస్తుందీ? ఎద్దుపుండు కాకికేం నొప్పా? నాలాంటి రోగం వాళ్ళకెప్పుడు వస్తుందో!" అని శపించింది.

"ఏమిటి చెప్మా యీవిడ బాధ?" అని నాలాంటివాళ్లు వాకబుచేశారు.

"విపరీతమయిన చిరాకు చచ్చినంత విసుగు, వల్లమాలిన ఆందోళన వర్ణించలేని అశాంతి" బావగారు చెప్పిన యీ మాటలు అర్థమవలేదు.

"ఇవి సింప్టమ్సు, ఇంకా అసలు బాధలు చెప్పనేలేదు. నీరసం, ఇంతా అంతా కాదు అది. గుండెదడ, చెప్పలేం-దాని తీవ్రత!"

ఒళ్లు వెచ్చగా ఉంటే యిల్లువాకిలీ ఏకంచేసే మనుషుల్ని చూశాంగాని ఏమీలేక పక్కమీద ఆరునెలలు గడిపే విచిత్ర వ్యక్తుల్ని చూడలేదు.

"భోజనం చెయ్యదా?" అని అడిగారుట ఒకరు.

"తెల్లారి లేస్తూనే కళ్లు తిరుగుతాయి. ఆ నీరసంమీద యింత మజ్జిగాన్నం పిసుక్కుతింటే గాని ప్రాణం దక్కుతుందా! సరే-యిక మధ్యాన్నంమాట. ఏదో పేరుకి ఎంగిలిపడడం, లేవడం. ఇక రాత్రిమాట చెప్పనే అక్కర్లేదు. చీకటిపడ్డ కొద్దీ ఆందోళన అధికమౌతుంది. ఇంత పడేసుకుంటేగాని అది ఆగదు. తిన్నదంతా అరుగుతే యిలా ఉందునా?" అని మా బావగారు కంట తడి పెట్టేరు.

"అరగక ఏమౌతుందండీ?"

"అయ్యోరాత! నీరైపోతుందండీ బాబూ! లేకపోతే తాగిన హార్లిక్సులో, గ్లాకోజులూ, ఓవల్టీనులూ ఏమైపోతున్నట్టూ? కొరికి పారేసిన దానిమ్మగింజలూ, ఊమ్మేసిన ఎండుద్రాక్షపళ్లు, ఒలిచిపారేసిన బత్తాయిపళ్ళూ ఇవన్నీ యేమౌతున్నాయి?" అన్నాడు బావగారు.

ఎప్పుడు వెళ్ళినా "మొన్న కామాక్షి బతుకుతుందనుకోలేదమ్మా" అని చెప్పే జల్లీ-అపురూపం చెయ్యడానికి వెనుదియ్యని మా ఆడంగి అన్నగారూ, వీళ్ళిద్దరూ ఉండగా యింక మా వదినకు జబ్బు తగ్గేదేమిటి? ఇల్లరికం, హద్దుమీరిన అపురూపం, యివన్నీ సోమరితనాన్ని పెంచేజబ్బులు! "అన్నిటికీ అన్ని జబ్బులూ ఉన్నాయిగాని అడ్డెడు తప్పేలాకి మాత్రం నాకేజబ్బూ కనిపించలేదు!" అని ముగించింది శారద.

* * *

పరిశుభ్రానికి, కడుపునిండా తిని ఆరోగ్యంగా బ్రతకడానికీ వీలులేని నేటి పరిస్థితులలో-అనేక కొత్తరకం జబ్బులతో అనేకమంది హతమారిపోతున్నారు. నిజమైన జబ్బులతో, చాకిరీలుచేసే ఓపికలులేక, డబ్బుపెట్టేదిక్కులేక, అక్కయ్యలు అన్నయ్యలు అణగంటిపోతున్నారు, ఇలాంటప్పుడు తనకి "ఎవరికీలేనంత గొప్పజబ్బు" ఉన్నదంటే అదో క్వాలిఫికేషనులా పొంగిపోయే మా అక్కయ్యా మేనత్తలాంటివారి మాయరోగాల్ని మనం క్షమించకూడదు. నీకూ నాకూ యిలాంటి మనుషులు తారసపడుతూనే ఉంటారు. మనం ఊరుకోవద్దు, తప్పకుండా ఖండించుదాం.